ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులను చేర్పించండి

● కాలేజీ అధ్యాపకుల ప్రచారం

భూదాన్ పోచంపల్లిలో ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

భూదాన్ పోచంపల్లి, జూన్ 1 : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ స్థానిక ప్రభుత్వ కాలేజీ అధ్యాపకులు శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కాలేజీలో ప్రైవేట్ కళాశాలలకు దీటుగా విద్యా బోధన జరుగుతుందని, తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ కాలేజీకి పంపాలని సూచించారు.

కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కోట విజయభాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు సంతోష్, వెంకట్‌రెడ్డి, వెంకటేశం, సాయివర్ధన్ పాల్గొన్నారు.

బట్టుపల్లి శ్రీనివాస్ ఆశయ సాధనకు కృషి చేయాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

భువనగిరిలో శ్రీనివాస్ స్మారక స్థూపం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

భువనగిరి సిటీ, జూన్ 1 : సీపీఎం భువనగిరి పట్టణ మాజీ కార్యదర్శి, మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బట్టుపల్లి శ్రీనివాస్ ఆశయ సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. పట్టణంలోని సింగన్నగూడెం చౌరస్తాలో శనివారం నిర్వహించిన బట్టుపల్లి శ్రీనివాస్ 13వ వర్ధంతిలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు చేసిన శ్రీనివాస్ ప్రజల హృదయాల్లో నిలిచారన్నారు. శ్రీనివాస్ స్ఫూర్తితో ప్రజా పోరాటాలను ఉధృతం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నిర్మాణంలో, ప్రజా సంఘాల ఏర్పాటులో శ్రీనివాస్ పాత్ర గొప్పదని పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనూరాధ అన్నారు. పార్టీ జిల్లా నాయకులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, దాసరి పాండు, పట్టణ కార్యదర్శి మాయ కృష్ణ, నాయకులు దయ్యాల నర్సింహ, వెంకటేశ్, నర్సింహ, మాతయ్య, ఎల్లయ్య, రాజు, గిరి, అంజయ్య, మల్లేశ్, శ్రీనివాస్, వనిత, కృష్ణ, పద్మారావు, యాదగిరి పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందించాలి : సీపీఎం

మాట్లాడుతున్న సీపీఎం మండల కార్యదర్శి వెంకటనర్సు

మోత్కూరు, జూన్ 1 : వానకాలం సీజన్ ప్రారంభమైనందున రైతులకు విత్తనాలు, ఎరువులను సబ్సిడీపై అందించాలని సీపీఎం మండల కార్యదర్శి గుండు వెంకటనర్సు డిమాండ్ చేశారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరులతో ఆయన మాట్లాడారు. రైతులు దున్నకం పనులు మొదలు పెట్టి పంటలు వేయడం కోసం సిద్ధంగా ఉన్నారని, ప్రభుత్వం ఎరువులు, విత్తనాలను సబ్సిడీపై అందజేయాలని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎకరాకు రూ.7500 పంట భరోసా అందజేయాలని కోరారు. సమావేశంలో పార్టీ మండల కమిటీ సభ్యుడు దడిపెల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

వానకాలం పంటలపై రైతులకు అవగాహన

ఆలేరు రూరల్ : మందనపల్లిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈఓ శాలిని

ఆత్మకూరు(ఎం), జూన్ 1 : మండలంలోని సర్వేపల్లి గ్రామంలో వానకాలం పంటల సాగుపై రైతులకు శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈఓ మనీషా మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. విత్తన ప్యాకెట్‌తోపాటు బిల్లును పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపర్చుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటిస్తూ పంట మార్పిడి చేపట్టాలన్నారు.

ఆలేరు రూరల్ : మండలంలోని మందనపల్లి గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వానకాలం సాగు సన్నద్ధతపై రైతులకు అవగాహన కల్పించారు. విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పనిసరిగా ప్యాకెట్‌పై వివరాలను సరిచూసుకొని బిల్లును పంట కాలం పూర్తయ్యేవరకు భద్రపరుచుకోవాలని ఏఈఓ శాలిని సూచించారు.

చెరువు తూము ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నీటి పారుదల శాఖ అధికారులకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

వలిగొండ, జూన్ 1 : మండలంలోని ఆరూరు గ్రామంలో గల ఊర చెరువు తూము, కత్వను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు భువనగిరిలోని నీటి పారుదల శాఖ కార్యనిర్వహణ కార్యాలయంలోని అధికారులకు శనివారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ చెరువు కత్వను, తూముతోపాటు సమీపంలోని మిషన్ భగీరథ పైపులైన్‌ను జేసీబీతో ధ్వంసం చేశారన్నారు.

వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రైతులు జక్కిడి శ్రీనివాస్‌రెడ్డి, సుక్క ముత్యాలు, కొప్పుల బాలరాజు, నర్సిరెడ్డి, రాంరెడ్డి, కృష్ణ, యాదయ్య పాల్గొన్నారు.

రక్తదానం చేయడంలో యువత ముందుండాలి

మోత్కూరులో రక్తదానం క్యాంపులో పాల్గొన్న యువకులు

మోత్కూరు, జూన్ 1 : ప్రమాద బాధితులకు, ఆపత్కాలంలో ఉన్న రోగులకు ప్రాణదానం చేసేందుకు యువత రక్తదానం చేయడంలో ముందుండాలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ డాక్టర్ జిలక్కీనర్సింహారెడ్డి అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి జన్మదినం పురస్కరించుకొని యూత్ కాంగ్రెస్, రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ, మండలంలోని పలు గ్రామాలకు చెందిన 50 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, నాయకులు పైళ్ల సోమిరెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకన్న, శ్రీనివాస్‌రెడ్డి, నాగేశ్ పాల్గొన్నారు.

క్షేత్రపాలకుడికి లక్ష నాగవళిదళార్చన

యాదగిరిగుట్టలో క్షేత్రపాలకుడికి లక్ష నాగవళిదళార్చన నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూన్ 1 : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి ప్రధానాలయంతోపాటు పాతగుట్ట గుండం వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో క్షేత్రపాలకుడికి లక్ష నాగవళిదళార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో విశ్వక్సేనారాధన, వాసుదేవ శుద్ధి పుణ్యాహవచనం, స్నపన ఆరాధన, ఆంజనేయస్వామికి అష్టోత్తర శతమన్యసూక్త పారాయణాలతో పంచామృత సుగంధ, ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం వేద పండితులు, పురోహితులు, అర్చకులతో లక్ష నాగావళి దళ పత్రాలతో క్షేత్రపాలకుడికి సహస్రనామార్చన శాస్త్రోక్తంగా సాగింది. అనంతరం స్వామివారికి మహా నివేదన చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు, ఆలయ ప్రధానార్చకులు నల్లన్‌ధీఘళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యులు, పర్యవేక్షకులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్టలో భక్తుల సందడి

స్వయంభూ పంచనారసింహస్వామిని దర్శించుకునేందుకు తరలివచ్చిన భక్తులతో తిరుమాఢవీధులు, క్యూ కాంప్లెక్స్ సందడిగా మారాయి. క్యూలైన్లు, ప్రసాద విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణకట్ట, బస్టాండ్, శివాలయం భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 36వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. తెల్లవారుజామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపారు. అనంతరం తిరువారాధన జరిపి ఆరగింపు చేపట్టారు. స్వయంభూ ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. నిజరూప దర్శనంలో స్వయంభూ నారసింహస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానాలయ వెలుపలి ప్రాకార మండపంలో సుదర్శన ఆళ్వారులను కొలుస్తూ అర్చకులు హోమం జరిపారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవ సేవ అత్యంత వైభవంగా సాగింది. ప్రధానాలయ ముఖ మండపంలో స్వామివారికి ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులతో సువర్ణ పుష్పార్చన జరిపించారు. బంగారు పుష్పాలతో దేవేరులకు అర్చన చేశారు. పాతగుట్ట స్వామివారికి నిత్యారాధనలు అత్యంత వైభవంగా సాగాయి. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ.50,89,865 ఆదాయం సమకూరిందని ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

మే నెల ఆదాయం రూ.18.60 కోట్లు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి మే నెలలో 18,60,39,810 రూపాయలు సమకూరాయని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. ఇందులో అత్యధికంగా ప్రసాద విక్రయాలతో రూ.4,79,72,210 రాగా, హుండీల ద్వారా రూ.3,93,88,092, వ్రతాలతో రూ.47,18,200 వచ్చినట్లు తెలిపారు. ఏప్రిల్‌తో పోలిస్తే మే నెలలో రూ.3కోట్లు అధిక ఆదాయం సమకూరిందని చెప్పారు. మే మాసంలో స్వామివారికి 64,630 మంది భక్తులు తలనీలాలు సమర్పించారని, సుమారు 605 బస్సుల్లో 11,42,579 మంది భక్తులకు కొండపైకి, కొండ కిందికి ఉచిత రవాణా సౌకర్యం కల్పించామని అన్నారు. దాతల సహకారంతో మాఢవీధుల్లో ఉన్న భక్తులు ఆర్జిత సేవలు తిలకించేందుకు ప్రత్యేకంగా ఎల్ఈడీ డిజిటల్ స్క్రీన్లను ఏర్పాటు చేశామన్నారు. శుక్ర, శనివారాల్లో సాయంత్రం 5నుంచి 7గంటల వరకు సంగీత సాహిత్య, నృత్య సభల నిర్వహణకు శాశ్వత షెడ్ ఏర్పాటు చేశామని వెల్లడించారు. వీఐపీ పార్కింగ్ స్థలంలో మహిళలకు ప్రత్యేకంగా మరుగుదొడ్ల సౌకర్యం కల్పించామని ఈఓ తెలిపారు.

సాంప్రదాయ వస్త్రాలపై విస్తృత ప్రచారం

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి బ్రేక్ దర్శనం, ఆర్జిత పూజల్లో పాల్గొనే భక్తులు సాంప్రదాయ వస్త్రాలు ధరించాలని తెలుపుతూ ఆలయ అధికారులు విస్తృత స్థాయి ప్రచారం చేపట్టారు. కొండపైకి వచ్చిన భక్తులకు దివ్యవాణి ద్వారా ప్రచారం నిర్వహించారు. నేరుగా భక్తులను కలిసి వివరించారు. మరో వారం రోజులపాటు ప్రచారం నిర్వహించి అమలు చేస్తామని ఆలయ ఈఓ భాస్కర్‌రావు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఆటంకం వాటిల్లకుండా సాంప్రదాయ వస్త్రాల అమలును కొనసాగిస్తామని వెల్లడించారు.

రోడ్డుపై పడిన గుంతను పూడ్చండి : సీపీఎం

గుంతను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

బీబీనగర్, జూన్ 1 : మండల కేంద్రంలోని బ్రాహ్మణపల్లి చౌరస్తాలో ప్రధాన రోడ్డుపై ఏర్పడిన గుంతను పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీబీనగర్ నుంచి నాగిరెడ్డిపల్లి వెళ్లే రోడ్డుపై బ్రాహ్మణపల్లి మూలమలుపు వద్ద కంకర తేలి ఏర్పడిన గుంతలను శనివారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించి మాట్లాడారు. గతంలో కురిసిన వర్షాలకు రోడ్డు పూర్తిగా కంకర తేలి గుంతలు పడిందని, వర్షం వచ్చినప్పుడు ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉన్నదని తెలిపారు. సంబంధిత అధికారులు రోడ్డు మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండారు శ్రీరాములు, నోముల ఎల్లారెడ్డి, బసవారెడ్డి, చిలుకయ్య, రాజిరెడ్డి, వెంకట్రావు పాల్గొన్నారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకలకు కార్యాలయాలు ముస్తాబు

ఆత్మకూరు(ఎం), జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ వేడుకల కోసం మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలు ముస్తాబయ్యాయి. రంగురంగుల కాగితాలు, మామిడి తోరణాలతో ఆఫీసులను అందంగా తీర్చిదిద్దారు.

ఆత్మకూరు(ఎం) మండల పరిషత్ కార్యాలయంలో రంగుల కాగితాలు అంటిస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

స్నాప్‌చాట్ ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థి అరెస్ట్

● 11.50 లక్షల విలువ చేసే 43ఎల్ఎస్‌డీ బ్లాట్స్, కారు స్వాధీనం

సిటీ బ్యూరో, జూన్ 1 (నమస్తే తెలంగాణ) : డ్రగ్స్ విక్రయిస్తున్న బీటెక్ విద్యార్థిని హెచ్-న్యూ పోలీసులు అరెస్టు చేశారు. నిందితుడి వద్ద నుంచి రూ.11.50లక్షల విలువ చేసే 43ఎల్ఎస్‌డీ బ్లాట్స్, కియా కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హెచ్-న్యూ డీసీపీ రమ్మీపెరుమాల్ కేసు వివరాలను వెల్లడించారు. యాదాద్రి జిల్లా భువనగిరి ప్రాంతానికి చెందిన వి.లక్ష్మీపతి అలియాస్ లక్కీ (28) బీటెక్ చదువుతున్నాడు. గంజాయికి అలవాటుపడిన లక్ష్మీపతి చదువును మధ్యలోనే ఆపేశాడు. తరువాత తన అలవాటునే ప్రవృత్తిగా మార్చుకుని గంజాయి వ్యాపారం మొదలు పెట్టాడు. తరచూ అరకు వెళ్లి గంజాయి కొనుగోలు చేసి విక్రయించేవాడు. కొద్ది రోజులుగా గోవా, కాజువల్ వంటి ప్రదేశాల్లో సోషల్ పార్టీలకు హాజరవుతున్నాడు. ఈ క్రమంలో వివిధ రకాల మాదక ద్రవ్యాల గురించి తెలుసుకుని, వాటిని విక్రయిస్తే అధికంగా డబ్బు సంపాదించవచ్చని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో గోవా, ముంబయి తదితర ప్రాంతాల నుంచి డ్రగ్స్ కొనుగోలు చేసి విక్రయించడం ప్రారంభించాడు. ఇందులో భాగంగానే నిందితుడు ముంబయి నుంచి లాజిస్టిక్ కొరియర్ ద్వారా ఎల్ఎస్‌డీ బ్లాట్స్‌ను కొనుగోలు చేశాడు. పోలీసు నిఘా నుంచి తప్పించుకునేందుకు ముందుగానే అవసరమున్న వినియోగదారులను స్నాప్ చాట్ ద్వారా సంప్రదించి వారి కోరిక మేరకు కొరియర్ పార్సిల్ ద్వారా వచ్చిన డ్రగ్స్‌ను విక్రయిస్తున్నాడు. ఈ మేరకు సమాచారం అందుకున్న హెచ్-న్యూ పోలీసులు శనివారం నిందితుడిని అరెస్టు చేశారు. అతడి వద్ద నుంచి రూ.11.50లక్షల విలువ చేసే 43ఎల్ఎస్‌డీ బ్లాట్స్, కారు, సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

ఘనంగా హనుమాన్ జయంతి

తుర్కపల్లిలో హనుమాన్ శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

యాదగిరిగుట్ట పట్టణంలో హనుమాన్ శోభాయాత్ర

వలిగొండ, జూన్ 1 : హనుమాన్ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వెంకటాపురం గ్రామ పరిధిలోని మత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి కొండపై అభయాంజనేయస్వామికి పూజలు నిర్వహించారు. స్వామివారికి 108 కళాశాలతో పంచామృతాలతో, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, నాగావళిదలార్చన, సింధూరార్చన, విశేష పుష్పార్చన తదితర కార్యక్రమాలను అర్చకులు ఘనంగా చేపట్టారు. మేకల బండ వద్ద ఏర్పాటు చేసిన భారీ అభయాంజనేయస్వామి విగ్రహ దాత గుత్తా జితేందర్‌రెడ్డి కుటుంబ సభ్యులు స్వామివారికి పూజలు నిర్వహించి రేకులతో మంటపాన్ని నిర్మిస్తామని దేవస్థానం అధికారులకు హామీ ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దేవస్థానం ఈఓ మోహన్‌బాబు, శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : పట్టణ కేంద్రంలో భక్తాంజనేయ, మార్కండేశ్వరస్వామి దేవాలయంతోపాటు పలు ఆలయాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తాంజనేయస్వామి భజన మండలి 25వ వార్షిక వేడుకలు నిర్వహించారు. ఆలయంలో మేలుకొలుపు, ధ్వజారోహణం, యజ్ఞం, విఘ్నేశ్వర స్వామి, నాగదేవతకు పూజలు, స్వామివారికి అభిషేకం, సహస్రనామార్చన, అష్టోత్తర శతనామావళి, షిరిడీ సాయి నామార్చన, నైవేద్య నివేదన, స్వామి సేవ ఊరేగింపు కార్యక్రమాలు కనుల పండువగా జరిగాయి. పొట్టబత్తిని గోవర్ధన్, అరుణ దంపతులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్లు కడవేరు వెంకటేశం, బడుగు చండీకేశ్వర్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ : పట్టణంలోని పాటి మీద ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు హోమం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, బత్తుల శ్రీశైలం, నాగరాజుగౌడ్, మల్లేశంగౌడ్, సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

సుద్దాలలో హనుమాన్ శోభాయాత్ర

గుండాల : మండలంలోని సుద్దాల గ్రామంలోని హనుమాన్ ఆలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర కనుల పండువగా జరిగింది. భక్తులకు గడ్డమీది అంజయ్య అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ యాకన్న, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గడ్డమీది పాండరి గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ లింగం, అర్చకులు సరాబోజు వెంకటేశ్వరాచారి, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆత్మకూరు(ఎం) : మండలంలోని అన్ని గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. మండల కేంద్రంలోని కనకదుర్గమ్మ ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాతలు ఏనుగు సురేందర్ రెడ్డి, సునంద, మాజీ జడ్పీటీసీ ప్రతికంఠం పూర్ణచందర్‌రాజు, లాల్‌రెడ్డి, కృష్ణమూర్తి, శంకర్ పాల్గొన్నారు.

తుర్కపల్లి : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో హనుమంతుడి విగ్రహాలకు చందనం పూసి పూజలు చేశారు. మండల కేంద్రంలో భక్తులు, యువకులు స్థానిక రామాలయం నుంచి హనుమాన్ ర్యాలీ నిర్వహించారు.

బొమ్మలరామారం : మండల కేంద్రంతోపాటు రాంలింగంపల్లి, మల్యాల, ఫక్కీర్‌గూడ, మర్యాల, ప్యారారం, నాగినేనిపల్లి తదితర గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో హనుమంతుడికి అభిషేకం, పూజలు, అన్నదానం కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో గట్టుమైసమ్మ ఆలయ మాజీ చైర్మన్ వంగ మధుసూదన్‌రెడ్డి, ఎంపీటీసీ రాజేందర్ రెడ్డి, గణేశ్, భాస్కర్, మహేశ్, భరత్ పాల్గొన్నారు.

రామన్నపేట : మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో హనుమాన్ జయంతి వేడుకలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

మోత్కూరు : పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలోని అభయాంజనేయస్వామి ఆలయంలో, అనాజీపురం, ధర్మాపురం, కొండగడప గ్రామాల్లోని దేవాలయాల్లో హనుమాన్ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి పంచామృతాలతో అభిషేకం, సింధూరంతో పూజలు చేశారు. పూజారులు మోత్కూరు ప్రదీప్‌శర్మ, సందీప్‌శర్మ, పారునంది సూరిబాబుశర్మ పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట : పట్టణంలోని గుండ్లపల్లి హనుమాన్ ఆలయం నుంచి శివాజీ రోడ్డు, గాంధీనగర్, నల్లపోచమ్మ వాడ మీదుగా యాదగిరిపల్లి హనుమాన్ ఆలయం వరకు భారీ హనుమాన్ విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. భజనలు, డీజే పాటలు, యువకుల నృత్యాలతో శోభాయాత్ర కోలాహలంగా సాగింది. చత్రపతి శివాజీ, శ్రీరాముడి విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో వీరధర్మజ పీఠాధిపతి స్వామీజీ, తోట భానుప్రసాద్, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ రాష్ట్ర సహ కార్యదర్శి పోత్నక్ రాఘవేంద్ర, జిల్లా అధ్యక్షుడు రాఘవుల సాయి, శ్రీశైలం, బీజేపీ పట్టణ అధ్యక్షుడు ప్రవీణ్ పాల్గొన్నారు.

భూదాన్ పోచంపల్లి : భక్తాంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేస్తున్న భక్తులు

మోత్కూరు : ధర్మాపురంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

గుండాల : సుద్దాల గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

అమర జ్యోతి ర్యాలీకి తరలిన మహిళలు

ఆత్మకూరు(ఎం) : అమర జ్యోతి ర్యాలీకి వెళ్తున్న బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకులు

ఆత్మకూరు(ఎం), జూన్ 1 : రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు శనివారం హైదరాబాద్‌లోని గన్‌పార్క్ నుంచి అమరవీరుల స్థూపం వరకు నిర్వహించిన కొవ్వొత్తుల ర్యాలీకి మండలం నుంచి మహిళలు తరలివెళ్లారు. ర్యాలీకి వెళ్లిన వారిలో బీఆర్ఎస్ మహిళా విభాగం మండలాధ్యక్షురాలు సోలిపురం అరుణ, మహిళా నాయకులు కొల నాగలక్ష్మి, గుండు సునీత, కొల స్వరూప, ఎలిమినేటి అంజమ్మ, కొల శిరీష, అండమ్మ తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

భూదాన్ పోచంపల్లి, జూన్ 1 : పట్టణంలోని సరస్వతి విద్యామందిర్ పాఠశాల 2003-04 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు.

ఈ సందర్భంగా చదువు నేర్పిన గురువులను సత్కరించారు. చిన్ననాటి బాల్య మిత్రులను కలుసుకొని పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్.సత్యనారాయణ, ఉపాధ్యాయులు కృష్ణకుమార్, లక్ష్మీనారాయణ, మహేశ్, పద్మ, విష్ణు, దామోదర్, అశోక్, ఉమాశంకర్, శ్రీనివాస్, బసవరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం ఇవ్వడం లేదని ఆందోళన

నూతనకల్, జూన్ 1 : రెండు నెలలుగా రేషన్ బియ్యం ఇవ్వడం లేదని పేర్కొంటూ మండలంలోని యడవెల్లి గ్రామంలో లబ్ధిదారులు శనివారం రేషన్ దుకాణం ముందు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. బియ్యం ఎందుకు ఇవ్వడం లేదని అడిగితే డీలర్ తిరుమలయ్య అసభ్య పదజాలంతో దూషిస్తున్నట్లు తెలిపారు. నీ ఇష్టం వచ్చినప్పుడు వస్తే ఇస్తానా అంటూ తనను చెంపపై కొట్టి అవమానించినట్లుగా ఏర్పుల లక్ష్మమ్మ అనే వృద్ధురాలు పేర్కొంది. ఎప్పుడు వెళ్లినా డీలర్ బియ్యం ఇవ్వడు. రేపు రా అంటూ తిప్పుతాడు. ఇదేంటని ప్రశ్నిస్తే ప్రతి నెలా ఇబ్బంది పెడుతాడని కట్ట సూరమ్మ అనే మహిళ తెలిపింది. ఏప్రిల్, మే రెండు నెలలు బియ్యం ఇవ్వలేదని చెప్పారు. తాసీల్దార్‌కు పలుమార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోయిందని వాపోయారు. డీలర్ గతంలోనూ బియ్యం అమ్ముకుంటే సస్పెండ్ అయి ఇటీవలే తిరిగి బాధ్యతలు తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ విషయమై తాసీల్దార్‌ను వివరణ కోరేందుకు ప్రయత్నించగా ఆయన ఫోన్‌కు స్పందించలేదు.

గుట్కా విక్రయాలు.. కేసు నమోదు

మఠంపల్లి, జూన్ 1 : నిషేధిత గుట్కా అమ్మితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్ఐ రామాంజనేయులు అన్నారు. ఎస్సీ ఆదేశాల మేరకు మండలంలోని కిరాణ షాపులు, టీ స్టాల్స్, పాన్‌షాపుల్లో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాన్‌పహాడ్ రోడ్‌లో గల బిస్మిల్లా పాన్‌షాప్‌లో గుట్కాలు లభించడంతో యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం నిషేధించిన పొగాకు ఉత్పత్తులు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆత్మకూర్.ఎస్, జూన్ 1 : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని నశింపేట గ్రామ శివారులో శనివారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం తాడ్వాయి గ్రామానికి చెందిన దేశగాని చందు (20) తన మిత్రుడు రాకేశ్‌తో కలిసి ఏపూరుకు వెళ్తుండగా నశింపేట గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న బర్రెను ఢీకొనడంతో రోడ్డుపై పడ్డారు. తీవ్రగాయాలతో చందు అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేశ్‌ను చికిత్స కోసం సూర్యాపేట ఆస్పత్రికి తరలించారు.